సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 31 । మే । 2024



దమ్మంటే ఆపండి!

సిగరెట్, బీడీ, తంబాకు, గుట్కా.. ప్రాణాంతకమని తెలిసినా వినియోగించే వారి సంఖ్యలో మార్పు ఉండటం లేదు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

- 8లో..



వ్యక్తి దారుణ హత్య

దాయాదుల మధ్య కుటుంబ కలహాలు ఓ వ్యక్తి హత్యకు దారితీశాయి. ఈ ఘటన ముండ్లమూరు మండలంలోని నుంకరవారిపాలెంలో గురువారం చోటుచేసుకుంది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
43/30

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పరీక్షలకు 2037 మంది గైర్హాజరు

ఒంగోలు: పది, ఇంటర్ పరీక్షలకు 2037మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం జరిగిన పదో తరగతి బయాలజీ పరీక్షకు 2538 మంది హాజరుకావాల్సి ఉండగా 1533 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 7258 మంది హాజరు కావాల్సి ఉండగా 6507 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1909 మందికి గాను 1628 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్, డీఈఓ డి.సుభద్ర తెలిపారు.

భైరవకోనలో ఎన్నికల పరిశీలకుల పూజలు



భైరవకోన పూజల్లో పాల్గొన్న జిల్లా ఎన్నికల పరిశీలకులు, వారి కుటుంబసభ్యులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ అరవిందకుమార్ చౌరాస్య, ఐఏఎస్ కుమార్ ఆర్ మెహతా వారి కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం సందర్శించారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు. తొలుత భైరవకోన జలపాతాన్ని సందర్శించి అనంతరం త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో చేశారు. అర్చకులు వారితో అభిషేకం, కుంకుమ పూజలు చేయించారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ శేషవస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో వారివెంట సీఎస్‌పురం తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, డిప్యూటీ తహసీల్దార్ యం.సలోమి, రెవెన్యూ సిబ్బంది ఆర్.శివకాశయ్య, సిబ్బంది రమణయ్య, అర్చకబృందం పాల్గొన్నారు.

మండలాలకు జగనన్న విద్యాకానుక కిట్లు

ఒంగోలు: పాఠశాలలు జూన్ 12 నుంచి పునః ప్రారంభం కానున్న దృష్ట్యా జగనన్న విద్యాకానుక కిట్లను మండలాలకు పంపుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,93,400 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ కిట్లు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాకు 9,30,010 పాఠ్యపుస్తకాలు అవసరమని అందులో 1 నుంచి 7వ తరగతి వరకు 4,60,043 పాఠ్యపుస్తకాలు, 10,80,628 నోట్‌బుక్స్ మొదటి విడతగా జిల్లాలోని 38 మండల స్టాక్ పాయింట్లకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. 8 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు నేరుగా మండల స్టాక్ పాయింట్లకే చేరుకుంటున్నాయన్నారు. జూన్ మొదటి వారం లోగా పూర్తిస్థాయిలో మెటీరియల్, యూనిఫాం, బ్యాగులు, బెల్టు, డిక్షనరీ, షూ, సాక్స్ మండలాలకు చేరుకుంటాయని వాటిని కిట్లుగా మార్చి పాఠశాలలకు అందిస్తామని తెలిపారు. ప్రైవేట్ స్కూలు యాజమాన్యం నిబంధనలు అనుసరించి పాఠ్యపుస్తకాలు సకాలంలో విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు నోటీసు బోర్డు ద్వారా ఫీజు వివరాలు, నోటు పుస్తకాలు వివరాలు పొందుపరచాలన్నారు, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులంతా పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యా కానుక కిట్లు అందేలా తగు చర్యలు తీసుకోవాలని డీఈఓ డి.సుభద్ర ఆదేశించారు.

పుడమికి నవ జీవం

ఏళ్ల తరబడి రసాయన ఎరువుల వాడకంతో నిస్సారమైన పుడమి తల్లికి జీవం పోసేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నవధాన్యలతో పచ్చిరొట్ట ఎరువులతో భూములను సారవంతం చేయడానికి రైతులను సమాయత్తపరుస్తోంది. వ్యవసాయం పెరుగుతున్న ఇబ్బడిముబ్బడి ఖర్చులను తగ్గించేందుకు పూర్తిగా సేంద్రియ ఎరువులతో ప్రత్యామ్నాయం చేసేందేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు సాగు చేసి వాటికి జీవం పోసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నవధాన్యాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తూ ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంలో రైతులు సాగు చేసేలా వ్యవసాయ శాఖాధికారులు ప్రోత్సహిస్తున్నారు.



కరువదిలో సాగు చేసిన నవధాన్యాల పొలం

- భూసారం పెంపునకు నవధాన్యాల సాగు
- జిల్లాలో 50 శాతం సబ్సిడీపై సరఫరా
- జిల్లాకు 2,773 క్వింటాళ్లు మంజూరు
- ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత
- ఇప్పటికే 8,503 మంది రైతులు 9,830.5 ఎకరాల్లో సాగు

ఒంగోలు సెంట్రల్: రైతులు ఒకప్పుడు సేంద్రియ ఎరువుల ఆధారంగా పంటలు సాగు చేసేవారు. దీంతో ఏళ్ల తరబడి పంటలు సాగు చేసినా భూమి స్వభావం మారేది కాదు. మారిన కాల పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతుల పట్ల మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణ రహితంగా వాడుతూ భూమిని నిస్సారంగా చేస్తున్నారు. రసాయన ఎరువులతో భూమి నిస్సారం కావడంతో పాటు ప్రకృతి సైతం కలుషితమవుతోంది. మరో వైపు రసాయన ఎరువులతో పండించిన పంటలను తినడం వల్ల ప్రజల్లో అనారోగ్య పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీనిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది.

పుడమికి పునరుజ్జీవం

జిల్లాలో వర్షాధార నేలలు ఎటువంటి పచ్చని పంటలు లేక తీవ్ర వేడిగాలులకు గురవుతున్నాయి. అధిక రసాయనిక ఎరువులు వాడి నిర్జీవమైన భూములకు పునర్జీవనం కల్పించి సహజ శక్తిని తిరిగి పొందడానికి ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు చేపట్టింది. పంటల సాగుకు వర్షాకాలం వచ్చే వరకు వేచి చూడాల్సిన అవసరాన్ని తగ్గించేందుకు ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముందుగా విత్తనాలను నేలలో నాటడం వలన వర్షాలు పడిన వెంటనే విత్తనాలు మొలకెత్తుతాయి. తర్వాత దున్నేస్తే భూమిలో కలిసి సారవంతమైన నేలగా తయారవుతుంది. గ్రామీణ వ్యవసాయ విధానంలో సాధారణంగా వర్షాకాలం ప్రారంభం తర్వాత పంటలు నాటుతారు. కానీ ముందు విత్తనాలు భూమిలో నాటడం ద్వారా వర్షం మొదలయ్యాక పంటలు త్వరగా మొలకెత్తేలా చేయటం నూతన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానం.



సంతనూతలపాడులో రైతులకు సూచనలు ఇస్తున్న పీడీ సుభాషిణి

నవ ధాన్యాల సాగు..

నవధాన్యాల సాగు మన పూర్వీకులు ఆచరించిన పద్ధతి. కానీ ఇది ఆధునిక వ్యవసాయం వలన మరుగున పడి పోయింది. ఇప్పుడు మళ్లీ నవధాన్యాల సాగు రైతులకు వరంగా మారింది. పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, జీవాల ఎరువు తదితర సహజ ఎరువుల సమస్యగా మారిన సమయంలో నవధాన్యాల సాగు భూసారం పెంచడానికి ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్ కిట్)లో ధాన్యాలు

కిట్‌లో 31 రకాల విత్తనాలు ఉంటాయి. కిట్ బరువు 15 కేజీలు ఉంటుంది. అందులో పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ, పిల్లి పెసరలు 500 గ్రాముల చొప్పున, చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు 500 గ్రాముల చొప్పున, సజ్జ, మొక్కజొన్న కేజీ చొప్పున, పప్పుజాతి ధాన్యాలైన కంది, శనగలు, బొబ్బర్లు, మినుములు, పెసర కేజీ చొప్పున, అనుములు 500 గ్రాములు, ఉలవలు 2 కేజీలు, ఎర పంటలైన బంతి 50 గ్రాములు, నూనె జాతి విత్తనాలు వేరుశనగ, ఆముదం 500 గ్రాముల చొప్పున, పొద్దుతిరుగుడు, నువ్వులు 250 గ్రాములు చొప్పున, సుగంధ ద్రవ్యాలైన ఆవాలు, ధనియాలు 250 గ్రాములు, ఆకుకూరలు తోట కూర, పాల కూర, గోంగూర 200 గ్రాముల చొప్పున, కూరగాయలు బెండ, వంకాయ 50 గ్రాముల చొప్పున, గోరుచిక్కుడు వంద గ్రాములు, తీగ జాతి అయిన బీర 20 విత్తనాలు, దోసకాయ 150 గ్రాములు, గుమ్మడి 10 గ్రాముల విత్తనాలు ఉంటాయి. ప్రధాన పంటలు అయిపోయిన తర్వాత వీటిని చల్లాలి. పంటను తీసుకోవాలనుకుంటే వరుస పద్ధతిలో విత్తుకోవాలి. పంట వేసిన 45 రోజులకు పశువుల మేతగా వాడుకోవచ్చు. భూసారాన్ని పెంచి అధిక దిగుబడులకు ఉపయోగపడుతుంది.

ఈ ఏడాది ప్రభుత్వ లక్ష్యం

జిల్లాలో నవధాన్యాల సాగు లక్ష్యం
78,014 ఎకరాలు

సాగుకు సిద్ధమైన రైతులు
55,584 మంది

ఇప్పటి వరకు తీసుకున్న రైతులు
14,715 మంది

జిల్లాలో సాగు ఇలా...

జిల్లాలో 78,014 ఎకరాల్లో 55,584 మంది రైతులతో నవధాన్యాలు సాగు చేయించాలన్న లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వహణ ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా శాఖ కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే 8503 మంది రైతులు 9830.5 ఎకరాలు సాగు చేశారు. నవధాన్యాలు కిట్స్‌ను 14,715 మంది రైతులకు పంపిణీ చేశారు. మరో వైపు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై 2773 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

జీవవైవిధ్యం పెరిగింది



ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌తో పొలంలో జీవ వైవిధ్యం పెరిగింది. కలుపు కూడా తక్కువగా ఉంది. మొక్కలు ఆరోగ్యంగా ఉన్నాయి. మొలకశాతం, తేమ, వానపాములు కూడా ఎక్కువగా ఉన్నాయి. వానపాముల బొరియలు కనిపించాయి. ప్రకృతి వ్యవసాయం బాగుంది.

– కరువది పద్మావతి, రైతు

జిల్లాలో రైతులను ప్రోత్సహిస్తున్నాం



నవధాన్యాల సాగు చేద్దాం.. నేల తల్లికి జీవంపోద్దాం అనే నినాదంతో జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగుకు ప్రోత్సహిస్తున్నాం. 55584 మంది రైతులతో 78 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని ఇప్పటికే 9800 ఎకరాల్లో 8503 మంది రైతులతో సాగు చేయించాం. 14,715 మంది రైతులకు నవధాన్యాల కిట్స్ అందించాం. ఆయా ప్రాంతాల్లో సాగు చేసిన నవధాన్యాలను పరిశీలిస్తున్నాం. రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– వి.సుభాషిణి, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సురేష్

సింగరాయకొండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4న రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో జరగనున్న కౌంటింగ్ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్ ప్రాంతాన్ని, కౌంటింగ్ జరిగే కేంద్రాల్లో ఏర్పాట్లను, భద్రతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు మంత్రి సురేష్‌కు వివరించారు. కొండపి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ కుమార్, సింగరాయకొండ తహశీల్దార్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1794 సర్వీసు ఓట్లు



సర్వీస్ ఓట్లను లెక్కిస్తున్న స్పెషలాఫీసర్ ఝాన్సీ లక్ష్మి

ఒంగోలు సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాకు 1794 సర్వీసు ఓట్లు వచ్చినట్లు జిల్లా పోస్టల్ ఓటింగ్ పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ కె.ఝాన్సీ లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సర్వీసు ఓట్లను లెక్కించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ సంబంధించిన సర్వీస్ ఓట్లు వచ్చాయన్నారు. వచ్చిన సర్వీస్ ఓట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి ఎన్ని వచ్చాయో లెక్కించి పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లో వేశామన్నారు. మొత్తం 6693 గాను గురువారం నాటికి మొత్తం 1794 ఓట్లు వచ్చాయన్నారు. ఈ ప్రక్రియ జూన్ 4 తేది ఉదయం 8 వరకు రోజు వారీగా వచ్చిన సర్వీస్ ఓట్లను భద్రపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, కాంగ్రెస్ నుంచి రసూల్, టీడీపీ నుంచి స్వరూప్, బీజేపీ నుంచి గుర్రం సత్యం తదితరులు పాల్గొన్నారు.

కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ నాశనం

- గెలుపోటములను సమానంగా స్వీకరించాలి
- బైండోవర్ నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా
- సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు
- గొడవల్లో పాల్గొన్న నిరుద్యోగులకు ఉద్యోగావకాలు పోతాయి
- జిల్లా వ్యాప్తంగా 257 రౌడీషీట్లు
- రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద పికెట్ల ఏర్పాటు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామపెద్దలు

ఒంగోలు టౌన్: ఓట్ల లెక్కింపు అనంతరం అవాంఛనీయ సంఘటనలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ దెబ్బతింటుందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గురువారం జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో డివిజన్‌లోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు అనేక మంది కుటుంబసభ్యులతో కలిసి దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చారని, అలాంటి వారు ఏదైనా గొడవల్లో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని, వీసాలు, పాస్‌పోర్టులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నిరుద్యోగులైతే భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులవుతాతారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా జిల్లాలో అనేక మందిని బైండోవర్ చేశామని వెల్లడించారు. ఎవరైనా బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి గొడవలు చేసినా, అల్లర్లకు పాల్పడినా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా చెల్లించాల్సి వస్తుందని, లేకుంటే జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లర్లను ప్రోత్సహించినా, కలిసి తిరిగినా ఇబ్బందులు పడతారని తెలిపారు. కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరైనా గుమిగూడరాదన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. బాణసంచా కాల్చరాదని, వాహనాల్లో ఎటువంటి మందుగుండు సామాగ్రి ఉంచరాదని చెప్పారు. సోషల్ మీడియా గ్రూపుల్లో మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు, కులమత రాజకీయ పార్టీలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదని, అవాస్తవాలను ప్రచారం చేయకుండా గ్రూపు అడ్మిన్లు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని గ్రూపు అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 145 రౌడీషీట్లు తెరిచామని, జిల్లా వ్యాప్తంగా 247 రౌడీ షీట్లు పెట్టినట్లు పేర్కొన్నారు. ఒక్కసారి డీ షీట్ ఓపెన్ అయితే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి ఉంటుందన్నారు. ఇంకా అనేక మందిపై పీడీ యాక్ట్ ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు.

అభ్యర్థులకు అదనంగా భద్రత.

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు అదనంగా భద్రతను పెంచినట్లు ఎస్పీ తెలిపారు. రాజకీయ పార్టీ కార్యాలయాల వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ నేపథ్యంలో ఒంగోలు సబ్ డివిజన్ ప్రత్యేక అధికారిగా అడిషనల్ ఎస్పీ రవి వర్మను నియమించామని, గొడవలు, అల్లర్లు, కొత్త వ్యక్తులకు సంబంధించిన సమాచారం ఉంటే 9493545764కు ఫోన్ చేయాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవి వర్మ, ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, సీఐడీ డీఎస్పీ ఎం మోహన్‌రావు, సబ్ డివిజన్ సీఐలు, ఎస్సైలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో ఆలస్యం వద్దు

- రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు ఈసీఐ, మీడియాకు తెలిపాలి
- కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళికతో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. రైజ్ కాలేజీలో కౌంటింగ్ ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలితాలను రౌండ్‌ల వారీగా ఎప్పటికప్పుడు ఈసీఐ, మీడియాకు తెలిపేందుకు తీసుకున్న ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూడాలన్నారు. ఓట్ల లెక్కింపుకు అనుగుణంగా టేబుళ్ల, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు కంప్యూటర్ల ఏర్పాట్లు కౌంటింగ్ గదిలోకి సిబ్బంది, ఏజెంట్లు ప్రవేశించేలా వేరువేరుగా బారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ వివిధ కోణాల్లో పర్యవేక్షించేలా సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కించేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది, ఏజెంట్లకు స్నాక్స్, భోజనం సదుపాయాలు సంబంధిత ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ శ్రీలత, మార్కాపురం రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనా, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి విశ్వేశ్వర రావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్ఓలు ఉన్నారు.

ఏపీ ఈసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

● రాష్ట్ర స్థాయిలో 5, 6 ర్యాంకులు సొంతం


మానికల రవిశంకర్


పొన్నూరి అశోక్

ఒంగోలు: ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల కాగా టాప్ టెన్‌లో జిల్లాకు రెండు ర్యాంకులు లభించాయి. జిల్లా నుంచి 1122 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 1069 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 970 మంది క్వాలిఫై అయ్యారు. బాలుర ఉత్తీర్ణత 89.52 శాతం, బాలికల ఉత్తీర్ణత 94.22 శాతం నమోదైంది.

కాగా ఒంగోలు రెడ్ క్రాస్ వీధిలోని మానికల రవిశంకర్ బీఎస్సీ ఎంపీసీ విభాగంలో 80 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకు, సెరామిక్ టెక్నాలజీ విభాగంలో కొత్తపట్నం రథం సెంటర్‌కు చెందిన పొన్నూరి అశోక్ 62 మార్కులతో రాష్ట్ర స్థాయి 6వ ర్యాంకు కైవసం చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆర్టీసీ డ్రైవర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గా ప్రసాద్

చీమకుర్తి: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్టీసీ డ్రైవర్ గుంటూరు రమేష్‌బాబు(43) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి తర్వాత చీమకుర్తి తూర్పు బైపాస్‌లో చోటుచేసుకుంది. చీమకుర్తిలోని ఇసుకవాగు సెంటర్‌కు చెందిన రమేష్‌బాబు పొదిలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

అనధికార బ్యారన్లు నిర్మించవద్దు


రైతులతో మాట్లాడుతున్న ఆర్ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: పొగాకు రైతులు అనధికార బ్యారర్లు నిర్మించవద్దని టుబాకో బోర్డు రీజినల్ మెనేజర్ ఎం.లక్ష్మణరావు సూచించారు. పొగాకు ధరలు అంతర్జాతీయ పరిణామాల మీద ఆధారపడి ఉన్నందున ప్రస్తుతం లభిస్తున్న ధర చూసి రైతులు అత్యుత్సాహంతో బ్యారర్లు నిర్మించి చేతులు కాల్చుకోవద్దని హితవు పలికారు. పొగాకు సాగు చేసే ముందు పచ్చి రొట్ట పైర్లు అయిన జనుము, పిల్లిపెసర సాగు చేసి కలియదున్నినతే భూసారం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

సిగరెట్, బీడీ, తంబాకు, గుట్కా.. ఇవి ప్రాణాంతకమని తెలిసినా వినియోగించే వారి సంఖ్యలో పెద్దగా మార్పు ఉండటం లేదు! బుద్ధి తెచ్చుకుని కొందరు మానేసినా.. ఇంకొందరు మాత్రం ఉత్సుకతతో మొదలుపెట్టి పొగాకుకు బానిసలవుతున్నారు. పదిహేను పన్నెండేళ్ల బాలలు మొదలు వృద్ధుల వరకు పొగాకుకు బానిసలై విలువైన జీవితాన్ని చేజేతులా పోగొట్టుకుంటున్నారు. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

మార్కాపురానికి 55 ఏళ్ళ సుబ్బారావు వారం రోజుల నుంచి తీవ్రమైన దగ్గు, ఆయాసం, జ్వరంతో బాధపడుతున్నాడు. వీధి మొదట్లో ఉన్న మందుల దుకాణానికి వెళ్లి మాత్రలు తెచ్చుకుని వాడాడు. జబ్బు తగ్గకపోవటంతో డాక్టర్ వద్దకు వెళ్లి ఎక్స్‌రే, రక్త పరీక్ష చేయించగా లంగ్ క్యాన్సర్‌గా తేలింది. చికిత్స తీసుకున్నా లాభం లేకుండా పోయింది. మృత్యువాతపడటంతో సుబ్బారావు కుటుంబం అనాథగా మిగిలింది. ఇలా ఏటా పొగాకు సంబంధిత పదార్థాలు వాడుతూ వందలాది మంది మృత్యువాత పడుతున్నారు.



దమ్ముంటే ఆపండి!

● ప్రాణాలు హరిస్తున్న ధూమపానం
● పొగాకు ఉత్పత్తుల వినియోగంతో క్యాన్సర్, గుండె పోటు
● సిగరెట్ పొగ పీల్చినా వ్యాధుల ముప్పు
● తక్షణమే ఆపేయాలని హెచ్చరిస్తున్న వైద్యులు
● నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

మార్కాపురం:

ధూమపానం, పొగాకు తీసుకోవడం శారీరక దుర్వ్యసనం. సినిమాలు, కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రభావంతో అనేక మంది చిన్నతనంలోనే ధూమపానం, పొగాకుకు బానిసలవుతున్నారు. సరదాగా స్నేహితులతో కలిసి దమ్ము కొట్టడం ప్రారంభించి చివరికి అదో అలవాటుగా మార్చుకుంటున్నారు. మెదడుకు అందే ఆక్సిజన్‌ను పొగాకులో ఉండే నికోటిన్ తాత్కాలికంగా అడ్డుకుని అందించే ఉత్తేజాన్ని ఆస్వాదించేందుకు, తద్వారా ఒత్తిడి, నిరాశా నిస్పృహలను ఎదుర్కోవడానికి ఎంతో మంది ధూమపానాన్ని దినచర్యలా ఆచరిస్తున్నారు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్యాకెట్లకు ప్యాకెట్లు సిగరెట్లు ఊదేస్తున్నారు. జిల్లాలోనూ సిగరెట్లు తాగేవారు, గుట్కాలు తినే వారి సంఖ్య లక్షల్లోనే ఉంది.

పొగాకుతో పెనుముప్పు

పొగ తాగడం వల్ల మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం కలుగుతుంది. ఊపిరితిత్తులు దెబ్బతిని లంగ్స్, నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. దీంతో పాటు గ్యాస్ట్రబుల్, ఆయాసం రావడం, వివిధ రకాల అలర్జీలు వస్తాయి. గుట్కా, జర్దా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు నమలడం కూడా ప్రమాదకరం. పొగ తాగే వారితో పాటు ఆ పొగ పీల్చే వారిలో కూడా దాదాపు 30 శాతం మందిలో ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి. మీరు ధూమపానం చేయకపోయినప్పటికీ ధూమపానం చేసే వారి దగ్గర ఉండడమూ ప్రమాదకరమే.

బహిరంగంగా పొగ తాగడం నిషేధం

బీడీ, సిగరెట్, చుట్ట బహిరంగ ప్రదేశాల్లో కాల్చడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, సినిమా హాల్స్, మాల్స్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పొగ తాగితే మున్సిపల్, పోలీస్ అధికారులు 100 రూపాయల వరకు జరిమానా విధించేలా చట్టం చేసింది. అయితే ఇది సక్రమంగా అమలు కావడం లేదు.

లైఫ్ లాంగ్ రిస్క్



20 ఏళ్లపాటు నిరంతరం స్మోక్ చేసే వారికి లైఫ్ లాంగ్ క్యాన్సర్ రిస్క్ పొంచి ఉంటుంది. విద్యార్థి దశలో ప్రారంభమై 40 ఏళ్లు వచ్చే దాక సిగరెట్ తాగి మానేసినా ఎప్పుడైనా క్యాన్సర్ వస్తుంది. ప్రధానంగా కొంత మందిలో సీఓపీడీ అనే ప్రమాదకరమైన జబ్బు వస్తుంది. ఇది వస్తే రోజూ ఆక్సిజన్ పెట్టుకోవాలి. ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ వస్తుంది. పెదాలు, నాలుక, గొంతు, కిడ్నీలు, లివర్ తదితర క్యాన్సర్లు వస్తాయి. స్మోక్ చేసి వదిలేటపుడు 7 వేల కెమికల్స్ బయటకు వస్తాయి. ఇందులో 67 కెమికల్స్ క్యాన్సర్ కారకాలు. ధూమపానం మానేస్తేనే ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించగలుగుతారు.

– డాక్టర్ శివశంకర్, పల్మనాలజిస్టు

మీకు తెలుసా?

సిగరెట్ తాగి పొగ వదిలేటపుడు 7 వేల కెమికల్స్ బయటకు వస్తాయి. ఇందులో 69 కెమికల్స్ క్యాన్సర్ కారకాలు. ఈ భయంకర నిజం పొగ తాగేవారికి తేలీదు. తాము ఫ్యాషన్‌గా సిగరెట్, బీడీ, చుట్ట తాగుతున్నామని ఆనందపడుతున్నారేగానీ, మరణానికి దగ్గరవుతున్నామని తెలుసుకోలేకపోతున్నారు.

ధూమపానం మానేస్తే..

- 20 నిమిషాల్లోనే హృదయ స్పందన రేటు సాధారణ స్థితికి వస్తుంది.
- 12 గంటల్లో.. కార్బన్ మోనాక్సైడ్ లెవెల్స్ సాధారణ స్థాయికి చేరుకుంటాయి.
- 1- 9 నెలల్లో.. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శ్వాస లోపం, దగ్గు తగ్గుతాయి.
- ఒక ఏడాదిలో.. గుండె జబ్బులు వచ్చే ప్రమాదం సగానికి పైగా తగ్గుతుంది.
- ఐదేళ్లలో.. గుండె పోటు ప్రమాదం బాగా తగ్గుతుంది.
- పదేళ్లలో.. ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు సగానికి పైగా తగ్గుతుంది.
- 15 ఏళ్లలో.. గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎప్పుడూ ధూమపానం చేయని వారితో సమానంగా ఉంటుంది.



వ్యక్తి దారుణ హత్య

● కుటుంబ కలహాల నేపథ్యంలో దాడి
● పోలీసుల అదుపులో నిందితుడు

ముండ్లమూరు: దాయాదుల మధ్య కుటుంబ కలహాలు ఓ వ్యక్తి హత్యకు దారితీశాయి. ఈ ఘటన ముండ్లమూరు మండలంలోని సుంకరవారిపాలెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నలబోతుల బ్రహ్మయ్య(52), నలబోతుల వెంకటేశ్వర్లు దాయాదులు. గురువారం తాళ్లూరు మండలంలోని గుంటి గంగమ్మ అమ్మవారి వద్ద గ్రామస్తులు మొక్కులు చెల్లించేందుకు వెళ్లారు. వారితో పాటు బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు. అక్కడ ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారితీసింది. ఇద్దరూ టీడీపీ సానుభూతిపరులు. అందరితో పాటు ప్రత్యేక వాహనంలో సాయంత్రం ఇంటికి చేరారు. బ్రహ్మయ్య ఇంటికి వచ్చాక స్థానికులతో మాట్లాడుతుండగా మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వర్లు ఇటుక రాయితో ఒక్కసారిగా తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బ్రహ్మయ్యను


మృతి చెందిన బ్రహ్మయ్య

ప్రైవేట్ వాహనంలో అద్దంకి వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి బ్రహ్మయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న దర్శి సీఐ ఎస్‌కే షమీవుల్లా సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివాదానికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ షమీవుల్లా

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

కొండపి(సింగరాయకొండ): తీవ్రమైన వడగాడ్పుల ప్రభావంతో కొండపి గ్రామానికి చెందిన వృద్ధురాలు కొర్రపాటి అచ్చమ్మ(79) గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొండపిలోని హైస్కూల్ ఎదురు బజారులో నివసిస్తున్న అచ్చెమ్మ గత నాలుగు రోజుల నుంచి కాస్తున్న ఎండలతో అనారోగ్యానికి గురైంది. గురువారం ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం విశ్రాంతి తీసుకుంటూ నిద్రలోనే మృతి చెందింది.

రౌడీషీటర్లపై నిఘా ఉంచండి

● ఎన్నికల ప్రత్యేకాధికారి, ఎస్పీ హిమవతి


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ హిమవతి

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో కౌంటింగ్ అనంతరం ఎటువంటి గొడవలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల ప్రత్యేకాధికారి, ఎస్పీ హిమవతి స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, స్థానిక డీఎస్పీ బాలసుందరరావు ఇతర పోలీసు అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లు, గొడవలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు వారిని బైండోవర్ చేయించాలని ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడాలని, అవసరమనుకుంటే కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలకు వెళ్లి ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి గొడవలు, అల్లర్లకు పాల్పడితే జరిగే పరిణామాలపై వివరించాలని చెప్పారు. ప్రశాంతమైన జీవనానికి ప్రజలు సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా గొడవలు చేసిన వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు బైండోవర్ చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సైలు రెహమాన్, నాయక్ పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్

● అక్కడికక్కడే వంట మాస్టర్ మృతి


మృతి చెందిన వెంకటేశ్వరనాయుడు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

పెద్దదోర్నాల: ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు ఈ సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని యడవల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. నరసరావుపేటకు చెందిన వెంకటేశ్వర నాయుడు(46) మండల పరిధిలోని ఓ ఆశ్రమంలో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి మండల కేంద్రంలో వ్యక్తిగత పనులు ముగించుకుని ఆశ్రమం వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో యడవల్లి వద్ద నిలిపి ఉంచిన టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొనటంతో తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై అంకమరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య

చీమకుర్తి: ప్రేమ వ్యవహారం బెడిసికొట్టటంతో బెంగళూరుకు చెందిన ఇంపాన(22) అనే యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చీమకుర్తిలో రెండు రోజుల క్రితం చోటుచేసుకోగా గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బెంగళూరుకు చెందిన ఇంపాన చీమకుర్తి ఇసుకవాగు సెంటర్‌లో బేకరీ నిర్వహించే చేతన్ అనే వ్యక్తిని ప్రేమించింది. అతను పెళ్లికి నిరాకరించడంతో బెంగళూరులో కొందరు పెద్దలు వారి మధ్య రాజీ కుదిర్చి కొంత నగదు ఇప్పించారు. అంతటితో విషయం సద్దుమణిగిందనుకున్నారు. కానీ తనకు డబ్బు వద్దని, పెళ్లి చేసుకోవాలని ఇంపాన పట్టుబట్టడంతో చేతన్ ససేమిరా ఒప్పుకోలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదనే బాధతో ఇంపాన చీమకుర్తిలో తాను నివసిస్తున్న ఇంట్లో పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఇంపానను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బెంగళూరులో కుటుంబ సభ్యుల చెంతకు చేర్చినట్లు చీమకుర్తి సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

జిల్లా స్థాయి రగ్బీ జట్ల ఎంపిక

తాళ్లూరు(ముండ్లమూరు): జిల్లా స్థాయి రగ్బీ బాలబాలికల జట్లను గురువారం తాళ్లూరు మండలంలోని బొద్దికూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడే జట్లను ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా స్థాయి జట్టు ఎంపిక ప్రక్రియలో భాగంగా 10 నుంచి 16 ఏళ్ల వయసు గల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్ రవిప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంపిక చేసిన జట్లు భీమిలిలో నేటి నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ రగ్బీ పోటీల్లో పాల్గొంటాయని వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు.

బాలుర జట్టులో జి.కుమార్, శివరామకృష్ణ, పి.హేమంత్, కె.నందకిషోర్, ఎస్‌కే హుస్సేన్‌బాషా, కె.మనోహర్, కె.షాద్రక్, యు.తేజ, జె.ఇజ్రాయిల్, ఎం.రామ్‌చరణ్, ఎం.అభి, ఎస్.జాన్‌పాల్, బాలికల జట్టులో పి.కోమలి, పి.చందన, పి.అలేఖ్య, సీహెచ్ శిరీష, జి.సాక్షి, సీహెచ్ అఖిలప్రియ, పి.రక్షిత, పి.అమృతకు చోటు దక్కిందని రగ్బీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రవిప్రసాదరెడ్డి, కార్యదర్శి ఎస్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


రగ్బీ జిల్లా జట్టుతో కోచ్, అసోసియేషన్ ప్రతినిధులు